VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 11 జూలై 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 07

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## కోహెడలో హోల్‌సేల్ చేపల మార్కెట్



## ఎవరో స్క్రిప్టు రాసిస్తే మాట్లాడే వ్యక్తిని కాదు : ఎంపీ ఈటల

03

15 నుంచి ఈహెచ్‌ఎస్

## హెల్త్ కార్డులు

ఉద్యోగులతో భేటీలో సిఎస్ నిర్ణయం

02



భద్రాద్రి రాముడిపై ఆన..

# 117 వచ్చే ఎన్నికల్లో సీట్లు మావే

కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా తొక్కేస్తా

బావామర్దులు కలసి ఊరుమీద పడి తిరుగుతున్నారు

కెసిఆర్‌ను ఫామ్‌హౌజ్‌కే పరిమితం చేసేశాం

తెలంగాణలో 20 ఎంపి సీట్లు గెలిపిస్తే రాహుల్ ప్రధాని

మధిర రైతు ఆశీర్వాద సభలో భరోసా నిధులు విడుదల

సభలో సిఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవన్నారు. అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని.. 2029 మే-జూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలుస్తామని, ఇది భద్రాచలం రాముడిపై ఆన అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, భాజపాపై విమర్శలు చేశారు.

ఖమ్మం, జూలై 10 : ఖమ్మం జిల్లాలో జరిగిన రైతు ఆశీర్వాద సభ కాస్తా..ఎన్నికల ప్రచార సభగా మారింది. రాహుల్‌ను ప్రధానిని చయేయడమే తమ లక్ష్యమని సిఎం రేంవత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 20 పార్లమెంట్ సీట్లు గెలిపించాలని, దీంతో రాహుల్‌ను ప్రధానిని చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారమని కూడా రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని చెప్పారు. అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని చెప్పారు. 2029 మే-జూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో

-మిగతా 2 లో..

గతంలో రైతుబంధు కోసం

## తిప్పించుకున్నారు

పండించిన ప్రతి గింజను కొంటున్నాం

రైతు ఆశీర్వాద సభలో డిప్యూటి సిఎం భట్టి

03

# టిఆర్ఎస్‌ను గెలిపిస్తే.. అక్క రాజ్యం చూపిస్తా

-మిగతా 2 లో

తమ ప్రభుత్వంలో రైతుకు కుర్చీ వేసి గౌరవిస్తాం

మహిళల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తాం

గిరిజనుల సమస్యలై ఢిల్లీ దాకా కొట్లాడుతాం

పాంచజన్యంతో ముందుకు వెళతామన్న కవిత



భద్రాద్రి కొత్తగూడెం, జూలై 10 : ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేనను గెలిపిస్తే.. రైతును రాజును చేసి చూపిస్తానని ప్రజలకు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేయిస్తామని తెలిపారు. త్వరలోనే మహిళల కోసం ఒక ప్రత్యేకమైన వినూత్న ఆలోచనను చేశానని చెప్పారు. దీనిని త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. అన్న రాజ్యం కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని తెలిపారు. కొత్త పార్టీలో మార్పులు ఉంటాయని.. 'పాంచజన్యం' పేరుతో

-3వ పేజీలో

# సకలం చెరువు శిఖంలో ఫాతిమా కాలేజీ

హైడ్రా ఎందుకు అక్కడికి వెళ్లడం లేదు

ఎంఐఎంకు కాంగ్రెస్ ఎందుకు కొమ్ము కాస్తోంది

ఎక్స్ వేదికగా బండి సంజయ్ విమర్శలు

హైదరాబాద్, జూలై 10 : ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఫాతిమా మహిళా కళాశాల.. సకలం చెరువు పరిధిలో ఉందని కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి ఆరోపించారు. ఇది ప్రపంచమంతా చూస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చూడనట్లు నటిస్తోందని ఆయన మండిపడ్డారు. కళ్లున్నా చూడనట్లు నటిస్తూ ఎంఐఎం తొత్తుగా ప్రభుత్వం వ్యవహరిస్తోదని మండిపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఎంఐఎం పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు విమర్శలు చేశారు. పేదల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చివేస్తున్న ప్రభుత్వం.. అందరికీ కనిపిస్తున్న ఈ ఆక్రమణను మాత్రం ఎందుకు గుర్తించలేకపోతోందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్

-2వ పేజీలో





## అబద్ధాలకు పేటెంట్ రేవంత్

ఖమ్మం సభలో అబద్దాలతో మభ్య పెట్టారు

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

02



నీటిపారుదల మంత్రిగా

## హరీష్ చేసిందేమిటి?

హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

కాంగ్రెస్‌లోకి వస్తామంటే ఆలోచిస్తామని వెల్లడి

బిఆర్ఎస్ నిధులపై కవిత వ్యాఖ్యల్లో నిజముందని వెల్లడి

2 లో..

మూడు నెలలు నీటి పారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి సమస్యను పరిష్కరించి చూపిస్తానంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ముందు ఆయన కాంగ్రెస్‌లో చేరితే ఆ తరవాత ఆలోచిస్తామని అన్నారు. శుక్రవారం గౌడ్ మీడియాతో

హైదరాబాద్, జూలై 10 : పదేండ్లు ఏం చేయని వారు మూడు నెలల సమయంలో ఏం చేస్తారని అన్నారు. హరీశ్‌రావు పదేళ్లు మంత్రిగా ఉండి ఏం చేశారు? ఆయన జలవనరులశాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన ప్రాజెక్టే కుంగింది.. దాని గురించి ఏం చెప్పాలి. పదేళ్లు మంత్రిగా ఉంటూ ఏం చేశారు?.. మళ్లీ మూడు నెలలు ఎందుకు? బీఆర్ఎస్ పార్టీ నిధులపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణల్లో నిజముంది. ఒక ప్రాంతీయ పార్టీకి రూ.1,400 కోట్లు ఎలా వచ్చాయి? హరీశ్‌రావు కాంగ్రెస్‌లోకి వస్తాన

-2వ పేజీలో

# నీటిపారుదల మంత్రిగా హరీష్ చేసిందేమిటి?

(మొదటిపేజీ తరువాయి)

కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామన్నారు. పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని అన్నారు. సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదన్నారు. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తుంగతుర్తిలో నేతల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. దీనిపై ఇప్పటికే ఇద్దరు సీనియర్లను పరిశీలకులుగా నియమించామని చెప్పారు. వరంగల్ అంశాన్ని సచిన్ సావంత్‌కు, తుంగతుర్తి బాధ్యతను జగ్గారెడ్డికి అప్పగించాం. అందరితో చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వాన్ని కూలగొడతామని అన్నప్పుడు.. పది మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని చెప్పారు. నీళ్ల దోపిడీ జరిగినప్పుడు ఈటల మంత్రిగా ఉన్నారని మహేశ్ గుర్తుచేశారు.



# టిఆర్ఎస్‌ను గెలిపిస్తే.. అక్క రాజ్యం చూపిస్తా

(మొదటిపేజీ తరువాయి)

ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఎంత పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం.. తన ప్రయాణానికి మీ సహకారం కావాలని ప్రజలను కోరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామం ఆదివాసి నాయకపోడు గ్రామాల్లో సమస్యలు వారి జీవన విధానాన్ని తెలంగాణ రక్షణ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాజకీయాల కోసం రాలేదని.. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మీ ముందుకు వచ్చానని అన్నారు. వెనకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని స్థాపించానని వివరించారు. సమాజంలో ఉన్న వెనకబడిన వ్యవస్థను మార్చడానికే ఆడబిడ్డగా ధైర్యంగా తాను ముందుకు వచ్చానని పేర్కొన్నారు. మీ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉంది.. గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మార్పు రాలేదు.. నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరం.. గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని పేర్కొన్నారు. తెలంగాణలో ఆదివాసీకి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను కవిత సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడి ఆదివాసీలకు రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు బ్యాంక్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి.. ఇది వారి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.



# కోహెడలో హోల్‌సేల్ చేపల మార్కెట్

## రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మాణం

## శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

**రంగారెడ్డి,జూలై10 :** రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేసారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధు, రంగారెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, అడిషనల్ కలెక్టర్ చంద్రా రెడ్డి, మత్స్యకారులు పాల్గొన్నారు. తెలంగాణ మత్స్య రంగ చరిత్రలో మరో చారిత్రక ఘట్టంగా నిలిచే కోహెడలో అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం శంకుస్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సముద్రతీర ప్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా అంతర్గత రాష్ట్రంలో ఇటువంటి ఆధునిక ఎగుమతుల కేంద్రం ఏర్పాటు కావడం తెలంగాణకు గర్వకారణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, వారికి శాశ్వత ఉపాధి కల్పించడం, అంతర్జాతీయ మార్కెట్లకు అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో సుమారు రూ.47 కోట్ల వ్యయంతో ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ ప్రస్తుతం మంచినీటి చేపల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. 2025లో రాష్ట్రంలో సుమారు 4.20 లక్షల టన్నుల చేపలు, 15 వేల టన్నుల మంచినీటి రొయ్యల ఉత్పత్తి నమోదైంది. ఈ ఎగుమతుల కేంద్రం అందుబాటులోకి రావడంతో రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే చేపలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లు లభించి మత్స్యకారులకు మెరుగైన ధరలు అందనున్నాయి. తెలంగాణ చేపలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు దక్కనుంది. ఈ కేంద్రంలో ఆధునిక శీతల గిడ్డంగులు, శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణా కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. సుమారు 2 వేల మంది వ్యాపారులు ఇక్కడ వ్యాపారం నిర్వహించే అవకాశం ఉండగా, లోడింగ్, అన్‌లోడింగ్, ప్యాకేజింగ్, రవాణా తదితర రంగాల్లో సుమారు 5 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు కేవలం చేపల మార్కెట్ మాత్రమే కాకుండా తెలంగాణ మత్స్య రంగాన్ని ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానం చేసే అభివృద్ధి వేదికగా నిలవనుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, మత్స్యకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే ప్రతి చేపకు ప్రపంచ మార్కెట్ అందించడమే మా లక్ష్యం. మత్స్యకారుల కుటుంబాల్లో ఆర్థిక సంతోషం నింపడమే మా ప్రభుత్వ సంకల్పం.' అని ప్రభుత్వం పేర్కొంది.



# భద్రాద్రి రాముడిపై ఆన.. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు మావే

(మొదటిపేజీ తరువాయి)

117 సీట్లకు పైగా గెలుస్తామని.. ఇది భద్రాచలం రాముడిపై ఆన అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురం లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, భాజపాపై విమర్శలు చేశారు. ఇక్కడి ప్రజలను చూస్తే నా గుండె పులకిస్తోంది. రాజకీయంగా నాకు పాలమూరు ప్రాణం. నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పనిచేసింది. నేడు వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నాం. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారు. నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారు. ఉచిత కరెంట్.. కాంగ్రెస్ పేటెంట్ రైట్. మా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70లక్షల కోట్లు ఖర్చు చేశాం అని రేవంత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విశ్రమించరని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని కొందరు చెప్పారు. వాళ్లని ఎలా ఎదుర్కోగలరని ప్రశ్నించారు. వాళు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తోందని ఆనాడే చెప్పా.



ఎన్నికల్లో మాకు 64 సీట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచాం. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లోనూ గుండు సున్నా తప్పదని చేవెళ్ల సభలో చెప్పా. అన్ని ఎన్నికల్లోనూ నేను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కి పరిమితం చేశాం. కౌరవ వంశాన్ని తెలంగాణ గడ్డ నుంచి తొలగిస్తాం. కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, సర్వేలను ఓడిస్తాం. మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం. మోదీ, అమిత్‌షా ఇతర పార్టీలను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌లను చీల్చారు. ఇతర పార్టీలను కూడా లొంగదీసుకుని లోక్‌సభ సీట్ల పెంపు బిల్లును ఎలా అయినా ఆమోదింపజేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ విషయంలో వారు విజయం సాధించడానికి అవకాశం ఉందని రేవంత్ అన్నారు. ఇకపోతే రైతు భరోసా తుది విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఖమ్మంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. అన్నదాతల నిధులు విడుదల చేసేందుకు బటన్ నొక్కారు. అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణలో పదేళ్లపాటు బీఆర్ఎస్ రాక్షస పాలన సాగిందని సీఎం రేవంత్ అన్నారు. వారి పాలనలో రైతులకు బేడీలు వేశారని మండిపడ్డారు. దీంతో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అనేది లేకుండా ప్రజలు చేశారని ఆయన చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో 2023లో ఓ అద్భుతం జరిగింది. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌లోకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చారు. దీంతో ఆనాడు కాంగ్రెస్‌లోకి ఉప్పెనలా జనం వచ్చారు. కారు పార్టీని ప్రజలు ఇక్కడ మళ్లీ మొలకెత్తనీయకుండా చేశారు. 2023 ప్రభుత్వ ఏర్పాటు నుంచి ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌దే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేశారు.

అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకుంటూ వస్తున్నాం. రైతు కళ్లల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం. కల్వకుంట్ల కుటుంబంలో ఒకరంటే ఒకరికి నమ్మకం లేదు. కుళ్లు, కుతంత్రాలు, కుట్రలతో బయటకు వస్తున్నారు. అధికారం పోయిందనే అక్కసుతోనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. బావా బామ్మర్దులిద్దరూ ఊళ్లపై పడి తెగ తిరుగుతున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని విషప్రచారం చేశారు. ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకోండి.. సలసల మాడిపోతారు. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో సినిమా కథలు చెప్పారు. ఇప్పుడు పొంగులేటి 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచల రాముడి ఆలయం సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. బీజేపీతో హరీశ్ రావు మంతనాలు జరుపుతున్నారో, లేదో భద్రాచల రాముడిపై ఒట్టేసి చెప్పాలి. కారు పార్టీలో ఉంటావో లేదో కేసీఆర్‌పై ఒట్టేసి హరీశ్ రావు చెప్పాలి. తాటిచెట్టంత పెరిగినా ఆయనకు బుర్రలో గుజ్జు లేదు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని కేటీఆర్ చెల్లెలే చెబుతున్నారని తెలిపారు.



# కూకట్‌పల్లి ముత్తూట్‌లో భారీ మోసం

## ఖాతాదారుల బంగారానికి రెక్కలు

## పక్కదారి పట్టించిన మేనేజర్ ప్రియాంక రెడ్డి

## రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్, జూలై 10 :** హైదరాబాద్ కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ ప్రియాంకరెడ్డి వినియోగదారుల బంగారాన్ని మరో సంస్థలో తాకట్టుపెట్టారు. తద్వారా కోట్ల రూపాయలు దారి మళ్లించినట్లు సమాచారం. ఈ మోసానికి పాల్పడ్డట్లు గుర్తించడంతో వ్యవహారం బయటపడింది. తాకట్టుపెట్టిన బంగారం ఇప్పించాలని పలువురు వినియోగదారులు ప్రియాంకను నిలదీశారు. ఆమె పొంతనలేని సమాధానాలు చెప్పడంతో భారీ మోసం బయటపడింది. ఈ ఘటనపై కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో వినియోగదారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడకు చెందిన ప్రియాంకరెడ్డి.. కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ముత్తూట్ ఫైనాన్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ముత్తూట్‌లో బంగారం డిపాజిట్ చేస్తే రూ.1.40 వడ్డీకి రుణాలు ఇస్తుంటారు. ప్రియాంక మాత్రం 50 పైసలకే ఇస్తానని నమ్మబలికి వినియోగదారులను బురిడీ కొట్టించింది. ఆ వడ్డీ ముత్తూట్‌కు కాకుండా సొంత ఖాతాకు జమచేయించుకునేది. తీసుకున్న రుణంపై టాపప్ ఇప్పిస్తానంటూ ఓటీపీలు చెప్పించుకుని మరో మోసానికి తెరలేపింది. టాపప్ ద్వారా వచ్చే డబ్బును వినియోగదారులకు చేరకుండా తన ఖాతాలోకి మళ్లించుకునేది. ఈ క్రమంలో తనతో పాటు ముత్తూట్‌లో పనిచేసేవారి




తో పక్కనే మరో ఫైనాన్స్ సంస్థ ప్రారంభించింది. ముత్తూట్ వినియోగదారులకు తెలియకుండానే డిపాజిట్ చేసిన బంగారు ఆభరణాలను ఆ సంస్థలో డిపాజిట్ చేయించేది. అనంతరం ఇతర సంస్థలకు అధిక వడ్డీలకు ఇస్తూ సొమ్ము చేసుకునేది. ఓ వృద్ధుడు తాను తీసుకున్న రుణం తీర్చి బంగారు ఆభరణాలు తీసుకునేందుకు గురువారం సంస్థ వద్దకు వచ్చారు. రుణం చెల్లించిన తర్వాత ఎంతకీ ఆభరణాలు ఇవ్వకపోవడంతో ఆయన ప్రియాంకరెడ్డిని నిలదీశారు. గమనించిన కొందరు వినియోగదారులు కూడా మేనేజర్‌ను ప్రశ్నించారు. చివరికి మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామని ఎస్‌హెచ్‌వో రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆడిట్ చేయిస్తే ఎంత మోసం జరిగిందో తెలిసే అవకాశం ఉందన్నారు.

# 15 నుంచి ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులు

## ఉద్యోగులతో భేటీలో సిఎస్ నిర్ణయం

**హైదరాబాద్, జూలై 10 :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) హెల్త్ కార్డులను జులై 15 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈహెచ్ఎస్ అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు పొందే అవకాశం కలగనుంది. ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మరోవైపు ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన తేదీని ప్రభుత్వం త్వరలో ప్రకటించనుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్వాగతించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించిందని వారు పేర్కొన్నారు. హెల్త్ కార్డుల అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన వైద్య సేవలు మరింత సులభంగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అబద్ధాలకు పేటెంట్ రేవంత్

- ఖమ్మం సభలో అబద్ధాలతో మభ్య పెట్టారు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, జూలై 10 :** ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. మాట తప్పడం, పార్టీలు మారడం రేవంత్‌రెడ్డి సంస్కృతి అని.. తనది కాదని విమర్శించారు. తమ ఇద్దరి రాజకీయ చరిత్రే దీనికి నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డిలా ఒట్టు వేసి ఓ మాట.. వేయకుండా ఓ మాట చెప్పను. భద్రాద్రి రాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానన్న హామీ ఏమైందని నిలదీసారు. రాష్ట్రం సంగతి పక్కన పెట్టండి.. కనీసం ఖమ్మం జిల్లాలోనైనా రుణమాఫీ చేశారా అని అన్నారు. ఎందుకంత ఆవేశం, అసహనంతో రగిలిపోతున్నారని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి నీళ్లు లిఫ్ట్ చేయలేని చేతగానితనాన్ని అబద్దాలతో కవర్ చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై రాజకీయంగా పోరాడండి.. రైతులపై కక్ష తీర్చుకోవద్దన్నారు.. అన్నదాతల శాపం నుంచి ఈ ప్రభుత్వం తప్పించుకోలేదని హరీశ్‌రావు అన్నారు. గోదావరిలో నీరు ఎత్తిపోసి రైతులను ఆదుకోవాల్సింది పోయి, భద్రాచలం మునుగుతదిన ఎలా చెబుతారని అన్నారు. గతంలో లేని ముప్పు ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నారు.



# సకలం చెరువు శిఖంలో ఫాతిమా కాలేజీ

(మొదటిపేజీ తరువాయి)

వేదికగా బండి సంజయ్ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు వెంటనే కంటి పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందంటూ బండి సంజయ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నేతల కోసం రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆ పరీక్షల తర్వాత కూడా వారికి చెరువు పక్కన కళాశాల కనిపించకపోతే సమస్య కళ్లలో కాదు.. వారి రాజకీయాల్లోనే ఉందని అర్థం చేసుకోవాలన్నారు. మరోవైపు హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. కాంగ్రెస్ ఎక్కడ రాజకీయ రంగోలి వేయాలనుకుంటే అక్కడ ఫుల్ ట్యాంక్ లెవల్ గీతలు వారి మిత్రులకు అనుకూలంగా మారిపోతున్నాయంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికార పార్టీ తనకు అనుకూలంగా వ్యవస్థలను వినియోగిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కాగా, సకలం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఒవైసీ కాలేజీ ఉందనే అంశంపై ఇటీవల రాజకీయంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా బండి సంజయ్ చేసిన పోస్టు.. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి దుమారం రేపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# గతంలో రైతుబంధు కోసం తిప్పించుకున్నారు

**పండించిన ప్రతి గింజను కొంటున్నాం**

**రైతు ఆశీర్వాద సభలో డిప్యూటి సిఎం భట్టి**

**ఖమ్మం,జూలై10:** తెలంగాణలోని రైతులకు పెట్టుబడి సాయం అందించే క్రమంలో ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రైతు భరోసా పథకం కింద నూతనంగా రూ. 1,009 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయగా, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. గత ప్రభుత్వం రైతు బంధు నిధుల కోసం 169 రోజులు తిప్పించుకునేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లు ఇచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. ఇప్పటివరకు 74 లక్షల మంది రైతులకు, 1.45 కోట్ల ఎకరాల భూములకు గానూ మొత్తం రూ. 8,759 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించామన్నారు. అలాగే మహిళా సంక్షేమానికి కట్టుబడి కేవలం రెండున్నర ఏళ్లలోనే మహిళలకు రూ. 67,000 కోట్ల రుణాలను అందించామని, పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ రైతును రాజుగా చూస్తున్నామని భట్టి స్పష్టం చేశారు. మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు ఒక్కటి కూడా దెబ్బతినలేదని, కానీ బీఆర్ఎస్ నాయకులు రూ. 27,000 కోట్లతో అయిపోయే ప్రాజెక్టును రూ. 1,47,000 కోట్లకు పెంచి, కట్టక కట్టక కట్టిన కాళేశ్వరాన్ని కూల్చేశారని మండిపడ్డారు. హరీష్ రావు అబద్దాలన్నీ



ప్రోగేసి మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ చేసిన అప్పులు, వడ్డీలు కడుతూనే తాము ఉద్యోగుల బిల్లులు క్లియర్ చేస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నాయకుల భవిష్యత్తు అయిపోయిందని, వారు మళ్లీ మాయమాటలతో ఊళ్లలోకి వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని, తరిమి తరిమి కొడతారని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

## నిర్ణీత గడువులోగా సర్ పక్రియ పూర్తి చేయాలి

**ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ**

**హైదరాబాద్,జూలై10 :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ పక్రియపై పవన్ కుమార్ శర్మ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు(డిఇఓలు), ఓటరు జాబితా పరిశీలకులు పాల్గొన్నారు. సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజెషన్ పక్రియలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో డిజిటలైజేషన్ పక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రత్యేకంగా ఆదేశించారు. సర్ పక్రియలో అత్యుత్తమ పనితీరును కనబరిచిన జిల్లాల ఎన్నికల అధికారులతో కమిషన్ మాట్లాడి, వారు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకుంది. ఆ వ్యూహాలను ఇతర జిల్లాలు కూడా అమలు చేసి, ఎన్యూమరేషన్ పక్రియను పూర్తి చేసి చేయాలని ఆదేశించారు. దనంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ పక్రియలను ప్రతిరోజూ నిర్దేశిరచిన లక్ష్యాల ప్రకారం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారికి భారత ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో 2026 పక్రియను నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది.

## ఎవరో స్క్రిప్టు రాసిస్తే మాట్లాడే వ్యక్తిని కాదు : ఎంపీ ఈటల



**హైదరాబాద్, జూలై 10 :** కాళేశ్వరం అంశంలో తనపై కొందరు రకరకాలుగా మాట్లాడారని.. చిల్లర వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం లేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాజకీయాల ముసుగులో ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని హితవు పలికారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఎవరో ఆడిస్తేనో.. స్క్రిప్టు రాసిస్తేనో మాట్లాడే వ్యక్తిని కాదు. మేం స్వయం ప్రకాశకులం.. ఒకరు ఆడించి నట్లు ఆడే వ్యక్తులం కాదు. భాజపా ప్రాధాన్య అంశంగా కాళేశ్వరం సమస్య ను తీసుకున్నాం. ప్రాజెక్టులు, జల వివక్షపై ఉమ్మడి రాష్ట్రంలో కూడా పోరాడిన వ్యక్తిని నేను. ఎస్సారెస్పీ వచ్చాకే.. మా జిల్లాలో వ్యవసాయం పెరిగింది. కాళేశ్వరం కంటే ముందే.. అక్కడ జలయజ్ఞం జరిగింది. ఎస్సారెస్పీ గురించి అవగాహన ఉన్నవాళ్లకు అన్నీ తెలుస్తాయి. ఎల్‌నినో హెచ్చరికలు ఉన్నా.. ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. రైతులకు నీళు ఇచ్చే బాధ్యత సీఎంపై ఉంది. అన్నారం, సుందిళ్ల వినియోగంపై విశ్రాంత ఇంజినీర్లతో చర్చించాలి" అని ఈటల రాజేందర్ అన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో కోతుల బెడద ఉండదు

- ప్రతి గ్రామంలో కనీసం వంద ఎకరాల్లో సాగు చేయాలి
- రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన

**సిద్ధిపేట,జూలై10 :** ఆయిల్ పామ్ డిమాండ్‌కి తగ్గ ఉత్పత్తి లేదని.. రైతులు ఆ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా కోతుల బెడద ఉండదని.. వాతావరణ మార్పుల ఇబ్బంది ఉండదని చెప్పుకొచ్చారు. నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగు పెంచడానికి 5 ఎకరాలపైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో మెగా పామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు దాటిస్తే రూ.5 లక్షలు, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాలపైన సాగు ప్రోత్సహిస్తే రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు. ఎల్‌నినో రాబోతోందని.. తీవ్ర కరవు కాటకాలు వర్షాభావ పరిస్థితులు ఉంటాయని మంత్రి తెలిపారు. దీంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా రైతాంగం గురించి ఆలోచించే వారు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరమని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ఇరాన్ యుద్ధం వల్ల ధరలు పెరుగుతున్నాయని.. ఆయిల్ పామ్ దిగుమతి చేసుకుంటే ఇబ్బందులు తప్పవని.. అందుకోసం సొంతంగా ఉత్పత్తి పెంచాలని కోరారు. గత సంవత్సరం కాళేశ్వరం ప్రాజెక్ట్ లేనప్పటికీ 25 శాతం అదనంగా వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఆయిల్ పామ్‌కు పెద్దగా నీళ్లు అవసరం లేదన్నారు. చెన్నూరులో కూడా ఆయిల్ పామ్ సాగు వైపు చూస్తున్నారన్నారు '100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు ప్రోత్సాహకం ఇస్తే.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నేను కూడా రూ. 5 లక్షలు ఇస్తాను' అని మంత్రి వివేక్ ప్రకటించారు.

## రోడ్డు ప్రమాద ఘటనలో మరో ఇద్దరు కూలీల మృతి

**రాజన్న సిరిసిల్ల, జూలై 10 :** వేములవాడ మండలం అనుపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు మృతిచెందారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరు కూలీలు మరణించారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య మూడుకు చేరింది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా పూణెళి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇటీవల తెలంగాణకు వచ్చారు. కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండలంలోని జెగ్గారావుపల్లె వద్ద కొదురుపాకకు చెందిన కాంట్రాక్టర్ ద్వారా ఇక్కడ వరినాట్లకు కూలీలుగా వెళ్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం నాడు తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో వరి నాట్లు వేసేందుకు 17 మంది మహిళలు, ఆరుగురు పురుషులు వెళ్లారు. నాట్లు ముగించుకుని సాయంత్రం డ్రైవర్‌తో సహా మొత్తం 24 మంది టాటా ఏస్ వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. వారు అనుపురం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి ఆర్టీసీ అ÷-దదె వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో దాదాపు పది అడుగుల దూరంలోకి ఎగిరిపడి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వాసుదేవ్ (35) కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్‌తో పాటు 23 మందదికి తీవ్ర గాయాలయ్యాయయి. వారిని హుటాహుటిన వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉండగా.. అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

# కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలి

**ప్రాణహితలో నీళ్లు పారుతున్న కనిపించడం లేదా**

**ఎపికి సాయం చేసేందుకే రేవంత్ మిన్నకున్నారు**

**యాదాద్రి కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ మహాధర్నా**



**యాదాద్రి భువనగిరి, జూలై 10 :** కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ మహాధర్నా చేపట్టింద. జిల్లా వ్యాప్తంగా భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ అసమర్ధ పాలన వల్లే రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలన్నారు. నిరసన కార్యక్రమలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద బిక్షమయ్య గౌడ్,జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి,రాష్ట్ర నాయకులు, చింతల వెంకటేశ్వర్లు, క్యామ మల్లేష్, కల్లూరి రామచంద్రారెడ్డి, ఎలిమినేటి సందీప్ రెడ్డి, బీఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కన్నెపల్లి నుంచి 93.5మీటర్ల నుంచి నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాణహిత జలాలను ఎత్తిపోయకుండా దిగువకు వదిలిపెడుతున్నదని మండిపడ్డారు. సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 50టీఎంసీల జలాలను దిగువకు తరలిపోయినట్టు గణాంకాలే వెల్లడిస్తున్నాయన్నారు. ఇలాంటి సమయంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించుకోవడమే అత్యంత ముఖ్యమని వారు అన్నారు. ఎత్తిపోయడానికి నీళ్లే లేవంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన గంటల్లోనే దిగువన.. పట్టిసీమ, తాడిపూడి పంపులను ఏపీ సర్కార్ ఆన్ చేసినా గుర్తించడం లేదా అని అన్నారు. తెలంగాణలో వానల్లేక పంటలు ఎండుతున్నా, మేడిగడ్డలో ప్రాణహిత వరద పారుతున్నా గోదావరి జలాలను ఎత్తిపోయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతులురావడం లేదన్నారు. కానీ, అందివచ్చిన అవకాశంగా చంద్రబాబు సర్కార్ మాత్రం నీటిని లిఫ్ట్ చేయడం ప్రారంభించింది. ఆంధ్రాకు నీళ్లు పారించేందుకే ఇలా చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయని అన్నారు. పట్టిసీమకు గోదావరిని పంపేందుకే ఇక్కడ పట్టించుకోవడం లేదా అని నిలదీసారు. రేవంత్ సర్కార్ తీరుతో ప్రాణహిత జలాలు తెలంగాణకు కాకుండా పోతున్నాయి. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయకుండా దిగువకు వదిలిపెడుతున్నది. మొత్తంగా ఏపీ కోసమే రేవంత్ సర్కార్.. కన్నెపల్లి పంపులను ఆన్‌చేయడం లేదని వారు ఆరోపించారు.

## దంపతుల మిస్సింగ్ కేసులో కొత్త కోణం

**అధిక వడ్డీ ఆశతో 50 కోట్లు ముంచినట్లు వెల్లడి**

**పలువురి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**హైదరాబాద్,జూలై10 :** హైదరాబాద్‌లోని చెర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో స్విట్జర్లాండ్‌కు వెళ్లినట్లు చెప్పి అదృశ్యమైన దంపతుల వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. తొలుత మిస్సింగ్ కేసుగా నమోదైన ఈ ఘటనలో తాజాగా భారీ ఆర్థిక మోసం ఆరోపణలు వెలుగులోకి రావడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. పబ్బా చంద్రశేఖర్ (51), ఆయన భార్య పబ్బా స్వప్న (42) జూన్ 22న స్విట్జర్లాండ్‌కు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. అయితే ఆ తర్వాత జూలై 8 వరకు వారు కుటుంబ సభ్యులను ఫోన్ లేదా ఇతర మార్గాల్లో సంప్రదించలేదు. ఇద్దరి మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో అనుమానం వ్యక్తం చేసిన వారి కుమార్తె పబ్బా శ్రేయ చెర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దంపతుల ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో తాజాగా మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితమే పబ్బా చంద్రశేఖర్ దంపతులపై పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎక్కువ వడ్డీ ఇస్తామని, వివిధ పెట్టుబడి పథకాల పేరుతో డబ్బులు పెట్టిస్తామని చెప్పి సుమారు రూ.50 కోట్ల వరకు వసూలు చేసి మోసం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌లో పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించిన అనంతరం పబ్బా చంద్రశేఖర్ దంపతులు స్విట్జర్లాండ్‌కు వెళ్లి అక్కడే తలదాచుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. మిస్సింగ్‌గా కనిపిస్తున్న ఈ ఘటన వెనుక ఆర్థిక నేరం కోణం కూడా ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దంపతులు నిజంగా స్విట్జర్లాండ్‌కు వెళ్లారా.? ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు.? వారు దేశం విడిచి వెళ్లడానికి ముందు ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయి.? అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అలాగే మోసం ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలిస్తూ.. ఈ రెండు కేసుల మధ్య సంబంధం ఉందా అనే దిశగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు దంపతుల ప్రయాణ వివరాలు, బ్యాంకు లావాదేవీలు, బాధితుల ఫిర్యాదులు, విదేశీ ప్రయాణ రికార్డులను పరిశీలిస్తూ కేసును ఛేదించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం హైదరా బాద్‌లో సంచలనంగా మారింది.

## గచ్చిబౌలిలో వాటర్ ట్యాంకర్ బీభత్సం

**టూవీలర్‌ను ఢీకొనడంతో యువతి మృతి**

**హైదరాబాద్, జూలై 10 :** హైదరాబాద్ గచ్చిబౌలిలో వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అదుపు తప్పి రోడ్డుపై వెళ్తున్న యువతులను ఢీకొట్టడంతో పెద్ద ప్రమాదం జరిగింది. హాస్టల్ లో ఉంటూ ప్రైవేట్ జాబ్స్ చేస్తున్న యువతులలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. గచ్చిబౌలి ఫ్లైఓవర్ వద్ద ఈ ఘోర ప్రమాదం జరిగింది . వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి యాక్టివాపై వెళ్తున్న యువతులపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో గచ్చిబౌలిలోని హాస్టల్ లో ఉంటూ సేల్స్ గర్ల్‌గా పనిచేస్తున్న మల్లం భవాని(23) ఘటనాస్థలిలోనే చనిపో యింది. ఆమె స్నేహితురాలు సుభాషిని (30) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. భవాని, ఆమె స్నేహితురులా సుభాషిని అంజయ్య నగర్ లోని హాస్టల్ లో ఉంటున్నారు. గచ్చిబౌలి ట్రిబుల్ ఐటీ నుండి అంజయ్య నగర్ కు యాక్టివపై వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న యాక్టివా స్కూటీని వెనక నుంచి వేగంగా వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన మల్లం భవాని అక్కడికక్కడే మృతి చెందగా సుభాషినికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. భవాని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంక్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో బస్సు ఎత్తుకెళ్లిన తాగుబోతు

**టోల్‌గేట్ వద్ద అదుపుతప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొన్న బస్సు**

**జనగామ,జూలై10 :** జనగామ జిల్లాలో మద్యం మత్తులో ఓ వ్యక్తి చేసిన నిర్వాకం కలకలం రేపింది. జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిపి ఉంచిన అద్దె బస్సును ఎవరికి తెలియకుండా స్టార్ట్ చేసి తీసుకెళ్లాడు. సుమారు 21 కిలోమీటర్లు బస్సును నడిపించి చివరకు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ వాహనంలోనే తాళాలు వదిలేసి ఇంటికి వెళ్లాడు. ఇదే అవకాశంగా భావించిన పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన డోజర్ డ్రైవర్ జిట్టబోయిన వెంకన్న మద్యం మత్తులో బస్సును స్టార్ట్ చేసి అక్కడి నుంచి సూర్యాపేట వైపు తీసుకెళ్లాడు. జనగామ నుంచి బస్సును నడిపిస్తూ వెళ్లిన వెంకన్న, దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపానికి చేరుకున్నాడు. అక్కడ బస్సు అదుపు తప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. ప్రమాదాన్ని గమనించిన టోల్‌గేట్ సిబ్బంది అనుమానంతో వెంటనే దేవరుప్పుల పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దేవరుప్పుల పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని నిందితుడు వెంకన్నను బస్సుతో సహా అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత అతడిని జనగామ పోలీసులకు అప్పగించారు. అద్దె బస్సు యజమాని గంట గోపికృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు జనగామ సీఐ సత్యనారాయణరెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడు మద్యం మత్తులోనే బస్సును ఎత్తుకెళ్లాడా.? ఘటనకు దారితీసిన పూర్తి పరిస్థితులు ఏంటనే అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## డిపెండెంట్ ఉద్యోగాలపై పోరాటం ఆగదు

**20నుంచి చేపట్టబోయే దీక్ష యధాతథం**

**మణుగూరు పర్యటనలో కవిత స్పష్టీకరణ**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 10 :** సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో పోరాటం సాగుతుందని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. 20వ తేదీ లోపు డిపెండెంట్ ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇస్తే దీక్ష విరమణ చేస్తామని చెప్పారు. ప్రభుత్వం హామీ ఇవ్వకుంటే గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష చేయనున్నట్లు కవిత ప్రకటించారు. శుక్రవారం ఆమె మణుగూరులో పర్యటించారు. రెండో విడత 'బాయిబాట' రెండో రోజు పర్యటనలో భాగంగా మణుగూరు సింగరేణి పీకే ఓసీపీ-2 ను సందర్శించారు. ఫస్ట్ షిఫ్ట్ కార్మికులతో మాట్లాడేందుకు కవిత ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం కవితను సింగరేణి అధికారులు అనుమతించడంతో కార్మికులతో మాట్లాడారు. ఈ నెల 20 తేదీన నిరవధిక నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ కోసం మెడికల్ బోర్డ్ ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు సింగరేణి కార్మికుల హక్కు అని అన్నారు. అలియాస్ పేర్లు ఉన్న వారి నుంచి అఫిడవిట్లు తీసుకుని పేర్లు మార్చాలన్నారు. సింగరేణి బకాయిలు రూ.50 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో మూడు వేల ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. నెలకు రెండు సార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలన్నారు.



## రంగారెడ్డి జిల్లాలో ఆరుగురి దారుణ హత్య


షాబాద్: రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు దారుణ హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట దైవాలగూడలోని సొంత ఇంట్లో భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. అనంతరం షాబాద్ పీఆర్ ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి , నాయనమ్మ అడ్డు పడ్డారు. వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి "నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నా" అని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. శనివారం తెల్లవారుజామున ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.

**నిందితుడిని అప్పగించాలంటూ ఆందోళన**

ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వేగుచుక్క

# ఎత్తిపోతల పంచాయితీ!



**కాళేశ్వరంపై దాగుడు మూతలు కొనసాగుతున్నాయి. ఎవరిది నిజం అన్నది తేలడం లేదు. అధికార కాంగ్రెస్ కాళేశ్వరం పనికిరాదని, నీరు ఎత్తిపోయడానికి లేదని చెబుతోంది. చెరువులు కుంటలు నింపాలంటే ఎత్తిపోయాల్సిందే అని విపక్ష బిఆర్ఎస్ వాదిస్తోంది. సందట్లో సడేమియ్యాలా బిజెపి గోడవాటం వాదనలు చేస్తోంది. ఇందులో ఎవరు నిజం..ఎవరు అబద్ధం అన్నది తేలాల్సి ఉంది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయడంలో ఉన్న ఇబ్బందులు, కష్టనష్టాలను నిపుణుల కమిటీ తేల్చాల్సి ఉంది. ఎందుకంటే ఎల్‌నినో ప్రభావంతో వర్షాల జాడ లేకుండా పోయింది. జలాశయాలు వట్టిపోయాయి.**

ఎస్సారెస్పీ సహా గోదావరి బేసిన్‌లోని ప్రతి జలాశయం ఇప్పటికే డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. వానలు కురిసే అవకాశమూ తక్కువగానే ఉన్నది. ఎగువ నుంచి వరద వచ్చే ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ క్రమంలో కన్నెపల్లిలో పంప్‌లను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేస్తే తద్వారా ఎల్లంపల్లి సహా మధ్యమానేరు, దిగువ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, మల్కపేట తదితర రిజర్వాయర్లను నింపుకోవచ్చని బిఆర్ఎస్ వాదిస్తోంది. అదే విధంగా దేవాదుల నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా రేవంత్ సర్కార్ నీటిని లిఫ్ట్ చేయడం లేదని కూడా హరీస్ రావు అన్నారు. కేవలం ఎన్డీఎస్ఏ నివేదికలను సాకుగా చూపుతూ ప్రాణహిత జలాలను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలిపెడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.. కేవలం ఏపీలోని కృష్ణా డెల్టా కోసమే రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రాజెక్టులను పడావు పెడుతున్నారని ఆరోపించారు కూడా. అయితే ఇందులో నిజమెంత అన్నది తేలాల్సి ఉంది. దీనిని ఎవరు తేల్చాలన్నది ప్రజలకు తెలియదు. ప్రస్తుతం సర్కార్ వ్యవహరిస్తున్న తీరు సైతం అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్ల నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టి, తద్వారా పంటలు.. రైతుల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం డిమాండ్ చేసింది.

బరాజ్‌ల్లో మినిమమ్ డ్రా డౌన్ లెవల్ మేరకు జలాలను నిల్వ చేయవచ్చని, తద్వారా ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని స్పష్టంచేసింది. అదీగాక ఎస్సారెస్పీ ఎగువన, దిగువన ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం వరకు వరదనే లేకుండా పోయింది. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతున్నది. మరోవైపు కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా రోజుకు 2 టీఎంసీలను ఎత్తిపోసుకొనే సామర్థ్యమున్నది. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఎల్ నినో నేపథ్యంలో అప్పుడే ఎత్తిపోతలను ప్రారంభించింది. గోదావరిలో వస్తున్న వరదను ఉపయోగించుకుని కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నది. పోలవరం డ్యామ్ పూ-ర్తయ్యే వరకు కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకుని ఏలూరు జిల్లాలో పట్టిసీమ లిఫ్ట్ స్కీమ్‌ను ఏపీ గతంలోనే చేపట్టింది. రోజుకు 8,500 క్యూసెక్కుల జలాలను గోదావరి నుంచి లిఫ్ట్ చేసి కుడికాలువ ద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టుకు 80 టీఎంసీల మేరకు సాగునీటిని అందించడం ప్రధాన లక్ష్యం. అదేవిధంగా పోలవరం కుడికాలువకు సమాంతరంగా తాడిపూడి కెనాల్‌ను సైతం ఏపి నిర్మించింది. తాడిపూడి లిఫ్ట్ ద్వారా ఇక్కడా 1,400 క్యూసెక్కులను తరలించే ఏర్పాట్లు చేసింది. ఈ రెండు కాలువల ద్వారా గోదావరి జలాలను మళ్లిస్తున్నది. ప్రస్తుతం సూపర్ ఎల్ నినో నేపథ్యంలో పొరుగున ఏపీ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి లిఫ్ట్‌లను ప్రారంభించింది. సామర్థ్యం మేరకు గోదావరి జలాలను ఎత్తి పోసేందుకు సిద్ధమైంది.ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు పడటం లేదని,మరోవైపు కేంద్ర జలసంఘం తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని పెద్ద ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే సుమారు 16-46 శాతం తకువగా ఉన్నాయని వివరించారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రాణహిత నది మాత్రమే ఎల్లప్పుడూ ప్రవహించే నది. రాష్ట్రంలో నీరు లేని పరిస్థితిలోనూ ప్రాణహిత-గోదావరిలో వినియోగయోగ్య మైన వరద ప్రవాహాలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించు కోవడం అత్యంత సమంజసమని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రాణహితలో వరద నీటిమట్టం మేడిగడ్డ ఎండీడీఎల్ కంటే ఎత్తుగా కొనసాగుతున్నంతకాలం, మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌స్టేషన్ నీటిని లిఫ్ట్ చేసి, అన్నారం, సుందిల్ల బరాజ్‌లను ఎండీడీఎల్ స్థాయిల వద్దే కొనసాగిస్తూ, నీటిని ఎల్లంపల్లి వరకు తరలించ వచ్చని, అది హైడ్రాలిక్‌పరంగా స్థిరమైన, నమ్మకమైన విధానమని విశ్రాంత ఇంజనీర్లు స్పష్టంచేశారు. గత వరద అనుభవాల ప్రకారం, సాంకేతిక నియమాలకు లోబడి, జాగ్రత్తతో, సురక్షిత పద్ధతుల్లో లిఫ్టులను నడిపితే గ్రామాల ముంపు, ఆస్తి నష్టం, ప్రాణనష్టం వంటి ప్రమాదాలు లేకుండానే నీటి పంపింగ్ వ్యవస్థను సఫలీకృతంగా వినియోగించుకోవచ్చని విశ్రాంత ఇంజినీర్లు చెబుతున్నారు. అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో పంటలు, రైతుల ప్రయోజనాల ను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా గోదావరిలో వచ్చే వరదనీటిని కాపాడుకోవాలి. అది ఎలా చేస్తారన్నది ఆలోచన చేయాలి. ప్రస్తుత దుర్భర పరిస్థితుల్లో సాగు,తాగునీటి అవసరాల కోసం అత్యసవర కార్యాచరణ సిద్ధం చేయాలి. అదికూడా యుద్ధప్రాతిపదిక సాగాలి. అప్పుడే మనకు నీటి కష్టాలు తీరుతాయి. పదేపదే విమర్శలతో కాలయాపన చేయడం కూడా మంచిది కాదు. ప్రజల, రైతుల ప్రయోజనం దృష్ట్యా కార్యరంగం లోకి దిగాల్సి ఉంది.

# ప్రభుత్వం 27000 పాఠశాలలను 4 వేలకు కుదించడం అశాస్త్రియం.

-రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పి ఆర్సి ని వెంటనే ప్రకటించాలి.
- టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**



ప్రభుత్వం 27000 పాఠశాలలను 4 వేలకు కుదించడం అశాస్త్రియం అని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పిఆర్సి ని వెంటనే ప్రకటించాలనీ టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ (టిపిటిఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉపాధ్యా శిక్షణ లంచ్ అవరు లో సమావేశంలో నిర్వహించగా, అనిల్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఖండించారు. కొత్త కొత్త పేర్లతో పాఠశాలలు ఏర్పాటు చేసి ప్రస్తుతం ఉన్న పాఠశాలలను రేషనలైజేషన్ పేరిట 27 వేల పాఠశాలలను 4 వేలకు కుదించడం అనే అశాస్త్రియ విధానానికి స్వస్తిపలకాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు తమ సర్వీస్ మొత్తంలో ఏఒక్క పదోన్నతిని కూడా పొందకుండా పదవీ విరమణ పొందుతున్నారన్నారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయ పోస్టును సృష్టించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని కోరారు. 317 బాధితులకు న్యాయం చేయాలని, బదిలీలు పదోన్నతుల ప్రక్రియకు వెంటనే షెడ్యూలు విడుదల చేసి పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఆరు డీఏలు పెండింగ్లో ఉన్నాయని, పిఆర్సి ఇవ్వకుండా దాటవేస్తూ మూడు సంవత్సరాల కాలం గడిచిందని ముఖ్యమంత్రి స్వయంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సరికాదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పిఆర్ సి ని ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ టి. శ్రీనివాస్, శిక్షణ లో ఉన్న టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి.

- రిటైర్డ్ ఉద్యోగులు, ఎన్ సీ సీ క్యాడెట్లు, స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటును అందించాలి. కలెక్టర్ ఇలా త్రిపాఠి.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 10 :**



పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం నిజామాబాద్ నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఎన్ సీ సీ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ అమలులో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం ఒకింత వెనుకబడి ఉన్నందున ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దిష్ట గడువు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఈ దిశగా రిటైర్డ్ ఉద్యోగులు, ఎన్ సీ సీ క్యాడెట్లు, స్వచ్ఛంద సంస్థలు కూడా సహకారం అందించాలని కోరారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారం సరైన విధంగా నింపి సకాలంలో బీ ఎల్ ఓ లకు అందించేలా చొరవ చూపాలని అన్నారు. గత 2002 ఎస్ ఐ ఆర్ జాబితా వివరాలను బీఎల్ఓ యాప్ ద్వారా లేదా ఎన్నికల సంఘం వెబ్ సైట్ నుండి పొందవచ్చని సూచించారు. ఒకవేళ ఆ వివరాలు లభించని వారు ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన 13 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని జత చేస్తూ ఎన్యూమరేషన్ ఫారం అందించవచ్చని సూచించారు. ఈ విషయాలపై ఓటర్లను అవగాహన కల్పిస్తూ ప్రతి ఓటరు గడువు కంటే ముందే ఎన్యూమరేషన్ ఫారంలు అందించేలా చూడాలన్నారు. అప్పుడే ఆబ్సెంట్, షిఫ్టెడ్, డిలీట్, డెత్ ఓట్లను గుర్తించేందుకు వీలవుతుందని, ఎన్యూమరేషన్ ఫారంల డిజిటలైజ్ సకాలంలో జరుగుతుందని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను అందించని ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితా నుండి తొలగించబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం బీ ఎల్ ఓ లకు అందించేలా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీవైఎస్ఓ పవన్ కుమార్, ఎన్ సీ సీ అధికారి రాజశేఖర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఏఈఆర్ఓ లు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై అమెరికా మిస్సైల్ దాడులు

## అణు కేంద్రం వద్ద పేలిన భవనం



**టెహ్రాన్, జూలై 10 :** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. గురువారం అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గురువారం తెల్లవారుజామున ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. దీంతో అణు ప్లాంట్ ఆవరణలోని ఓ భవనం దెబ్బతింది. అమెరికా మిస్సైల్ దాడి చేసిన వెంటనే ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వెంటనే స్పందించి ఎదురుదాడి చేశాయి. పరస్పర దాడుల కారణంగా ఆ ప్రాంతం మొత్తం పేలుళ్ల శబ్దాలతో హోరెత్తింది. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న 'బుషెహర్' ప్రాంతంతో పాటు చోగడక్, బందర్ అబ్బాస్, వ్యూహాత్మక ఓడరేవు ఉన్న కొనారక్ ప్రావిన్స్‌లలో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. బుషెహర్ నగర శివార్లలోని మిలిటరీ ప్రధాన కార్యాలయంపై కూడా మిస్సైల్ దాడి జరిగింది. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీరప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే ఈ చర్యలు ఈ దాడులు చేస్తున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.

# ఒకే కాన్పులో నలుగురు పిల్లల జననం

## తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాల వెల్లడి

**జయపుర, జూలై 10 :** రాజస్థాన్‌లోని ఝలావర్‌లో ఒక అరుదైన ఘటన చోటుచేసుకుంది. 25 ఏళ్ల ఓ మహిళ ఒకే ప్రసవంలో నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. వారిలో ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగబిడ్డ ఉన్నారు. శిశువులు నెలలు నిండకుండానే జన్మించడం, బరువు కూడా తక్కువగా ఉండటంతో వారిని ప్రస్తుతం నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి వైద్యులు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ఝలావర్ నగరంలోని భోయ్ మొహల్లా నివాసితులైన జ్యోతి కశ్యప్ (25), అరుణ్ కశ్యప్ దంపతులకు ఇప్పటికే ఒక సంతానం ఉంది. రెండో ప్రసవం కోసం ఆమె స్థానిక ప్రభుత్వ హీరా కున్వర్ బా మహిళా ఆసుపత్రిలో చేరారు. బుధవారం ఉదయం వైద్యులు ఆమెకు సిజేరియన్ నిర్వహించగా నలుగురు శిశువులు జన్మించారు. సుమారు 29 వారాలకే ప్రసవం జరగడంతో శిశువులు కేవలం 1.1 కిలోల నుంచి 1.2 కిలోల బరువు మాత్రమే ఉన్నారు. సాధారణంగా పూర్తి నెలలు నిండిన శిశువులు 2.5 కిలోల బరువు ఉంటారని, అయితే ఈ శిశువుల ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో వారికి శ్వాస అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వైద్యులు వెల్లడించారు. తన వృత్తి జీవితంలో ఒకే ప్రసవంలో నలుగురు శిశువులు జన్మించడం చూడటం ఇదే మొదటిసారని డాక్టర్ విశాల్ పేర్కొన్నారు. సాధారణంగా ప్రతి 24,000 ప్రసవాల్లో ఒకరికి మాత్రమే ఇలా జరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నా రు. ప్రస్తుతం తల్లి జ్యోతి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆమెను గైనకాలజీ వార్డుకు తరలించినట్లు వైద్యులు తెలిపారు. శిశువుల్లో ఒకరి ఆరోగ్యం స్వల్పంగా మెరుగుపడగా మిగిలిన ముగ్గురి పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిణామంపై తండ్రి అరుణ్ కశ్యప్ హర్షం వ్యక్తంచేశారు. తాను ఒక కుమార్తె పుడుతుందని ఆశించాను. కానీ దేవుడు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడిని ప్రసాదించాడు. దైవ నిర్ణయం ఏదైనా తమకు సంతోషమేనని ఆయన పేర్కొన్నారు.

# ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తిన వర్షాలు

## విరిగిపడిన కొండ చరియలు

**ఉత్తరాఖండ్:** ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నదులు, వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో కొండచరియలు విరిగిపడడంతో పలువురు మృతి చెందారు. దిల్లీలోని పలు ప్రాంతాల్లో 160 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సూరత్‌లో రహదారులు జలమయమవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఉత్తరాఖండ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలకనంద, మందాకిని నదులు ఉప్పొంగుతుండడంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రుద్రప్రయాగ్ జిల్లాలోని పాఠశాలలను మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. 75 రోడ్లు దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయని.. 29 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించింది.

# ఫిల్మ్‌నగర్‌లో నటుడి ఇంట్లోకి దూసుకొచ్చిన కారు

## మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు

**హైదరాబాద్, జూలై 10 :** హైదరాబాద్ ఫిలింనగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి నేరుగా టాలీవుడ్ నటుడు ధర్మ నివాసంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి గేటు, ప్రహరీ గోడ ధ్వంసమయ్యాయి. అయితే ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు రోడ్డుపై నుంచి నేరుగా నటుడు ధర్మ ఇంటి ప్రాంగణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఘటన సమయంలో కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ధర్మ కుటుంబ సభ్యులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కారులో ఉన్న యువకులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

# గురజాడ తొలి స్నాతకోత్సవం విశాఖలో తగదు

## విజయనగరంలోనే నిర్వహించాలని కోరిన బొత్స

**అమరావతి, జూలై 10 :** ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ లేఖ రాశారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ గురజాడ-విజయనగరం తొలి స్నాతకోత్సవాన్ని విశాఖపట్నంలో నిర్వహించాలన్న నిర్ణయా న్ని పునఃపరిశీలించాలని బొత్స సత్యనారాయణ తన లేఖలో కోరారు.జేఎన్‌టీయూ గురజాడ తొలి స్నాతకోత్సవంపై బొత్స సత్యనారాయణ స్పందించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు బొత్స లేఖ రాశారు. ఈ లేఖలో బొత్స.. స్నాతకోత్సవానికి ఆహ్వానం అందించినందుకు గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపా రు. అయితే, విజయనగరం వంటి వెనుకబడిన జిల్లాలో విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో నిర్వహించడం సముచితమని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమం నిర్వహించడం వల్ల విజయనగరం జిల్లా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరసనలు వ్యక్తమవుతున్నాయని లేఖలో తెలిపారు. ఈ నిర్ణయం వల్ల జిల్లా ప్రజల గౌరవం, ఆనందం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విజయనగర ప్రజల అభిప్రాయాలను గౌరవించి, జేఎన్‌టీ యూ గురజాడ తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరంలోనే నిర్వహించేలా నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని గవర్నర్‌ను కోరారు. విజయనగరం ప్రజల అసంతృప్తి, నిరసనలను ఈ లేఖ ద్వారా గవర్నర్ దృష్టికి తీసుకువస్తున్నట్టు బొత్స తెలిపారు.

# తీరం వైపు దూసుకొస్తున్న తుఫాన్

## అప్రమత్తమైన చైనా ప్రభుత్వం

**బీజింగ్, జూలై 10 :** చైనా వైపు మరో రక్కసి తుఫాను దూసుకొస్తోంది. తూర్పు తీరంవైపు బావి తుఫాను వస్తోందని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. తుఫాను తీవ్రత అంతకంతకూ పెరుగుతున్న రీత్యా వాతావరణ శాఖ గురువారమే ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. శనివారం తుఫాను మొదట తైవాన్‌ను తాకి అనంతరం చైనాలోని ఫుజియన్, జెజియాంగ్ ప్రావిన్సుల్లో తీరాన్ని తాకనుంది. ప్రభావిత ప్రావిన్సుల్లో 40 సెంటీమీటర్ల వరకూ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. రక్కసి తుఫాను దూసుకొస్తున్న నేపథ్యంలో చైనా ప్రభుత్వం అప్రమత్తమైంది. తీరానికి సమీపంలోని 17 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. 1.70 లక్షల మంది విపత్తు నిర్వహణ సిబ్బందిని సిద్ధంగా ఉంచింది. తీర ప్రాంతాలతో పాటూ బీజింగ్ వరకూ తుఫాను ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం మధ్యాహ్నమే రాజధాని బీజింగ్‌లో అధికారులు ఎమర్జెన్సీని ప్రకటించారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. క్రీడా కార్యక్రమాలను వాయిదా వేశారు. ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు, గాలులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తైవాన్‌లో కూడా హైఅలర్ట్ ప్రకటించారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికే విమాన సర్వీసులు నిలిచిపోయాయి. హాంకాంగ్ ఎయిర్‌లైన్స్ పలు విమాన సర్వీసులను రద్దు చేసింది. గ్రేటర్ బే ఎయిర్‌లైన్స్ కూడా పలు విమాన సర్వీసులను నిలిపివేసింది. మిగిలిన విమానాలను దారి మళ్లించింది.



# కరూరు బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

## విజయ్ ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హైకోర్టు

**చెన్నై, జూలై 10 :** విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో భారీ ఊరట లభించింది. కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు ఉద్యోగ పత్రాల పంపిణీకి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ నియామక పక్రియను ముందుకు తీసుకెళ్లవచ్చని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగ నియామకాలు కేవలం 'తాత్కాలికం' మాత్రమేనని న్యాయస్థానం మెలిక పెట్టింది. భవిష్యత్తులో తుది తీర్పుకు లోబడి ఈ నియామకాలు ఉంటాయని స్పష్టం చేసింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్ శక్తివేల్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ధర్మాసనం.. ప్రభుత్వం ఈ ఉద్యోగాలు ఇవ్వడానికి అనుసరించిన మార్గదర్శకాలు ఏమిటి?.. బాధితుల కుటుంబాలకు ఆ అర్హతలు ఉన్నాయా లేదా? అనే విషయాలపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎలాంటి స్పష్టమైన పాలసీ లేకుండా.. విపత్తు బాధితులకు ఉద్యోగాలు కేటాయించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కు) పరిధిలోకి వస్తుందో లేదో సమీక్షిస్తామని పేర్కొంది. కాగా, బాధితుల కుటుంబాలకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం విజయ్ నియామక పత్రాలు అందజేయనున్నారు. అయితే, ఈ కేసును కోర్టు మళ్లీ విచారించే వరకు లబ్ధిదారులకు మొదటి నెల జీతం చెల్లించకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను జూలై 21కి వాయిదా వేసింది.